## క్లుప్తంగా

### కనులపండువగా పార్వేట ఉత్సవం



నెల్లూరు(బృందావనం): కనుమను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆండాళ్ అమ్మవారి పేట ఉత్సవాన్ని కనులపండువగా బుధవారం నిర్వహించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామికి పార్వేట ఉత్సవాన్ని పెద్ద శేషవాహనంపై జరిపారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కనుమ మడి మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. గణపతిపూజ, సహస్రనామార్చన, కనుమ పొంగళ్లు, గో పూజ, ప్రాకారోత్సవాన్ని జరిపారు. ఉభయకర్తలుగా ఇరిగేంద్ర, చంద్రశేఖర్ స్వామి వ్యవహరించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈఓ విరుపావరుఘుల గిరికృష్ణ, కోవూరు గ్రూప్ ఈఓ కృష్ణప్రసాద్,, ఉత్సవ కమిటీ చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### వేడుకగా గ్రామోత్సవం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామోత్సవాన్ని వేడుకగా రాత్రి నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు సాయిభరద్వాజ, ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డైరీ ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్): ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీని మంత్రి పొంగూరు నారాయణ బుధవారం ఆవిష్కరించారు. నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వెంకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కోశాధికారి మురళీమోహన్‌రావు, సంయుక్త కార్యదర్శి నళినీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### నేత్రపర్వంగా జ్యోతి దర్శనం



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో కర్పూర జ్యోతి దర్శనాన్ని నేత్రపర్వంగా మంగళవారం నిర్వహించారు. అయ్యప్పస్వామికి అభిషేకాలు, పూజలు, నెయ్యాభిషేకం, పుష్పాభిషేకాన్ని జరిపారు. అయ్యప్ప సేవా సమాజ కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, శంకరన్ తదితరులు పర్యవేక్షించారు.



అశేషంగా హాజరైన భక్తజనం



విశేషాలంకారంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి



# కమనీయం.. తెప్పోత్సవం

నెల్లూరు(బృందావనం): మైపాడు గేట్ సెంటర్‌లోని జాఫర్‌సాహెబ్ కాలువలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి కనుమ తెప్పోత్సవాన్ని కనులపండువగా బుధవారం నిర్వహించారు. నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారు సర్వాలంకారశోభితంగా కొలువై విశేష పల్లకిపై మైపాడుగేట్ సెంటర్‌కు తరలివచ్చారు. భక్తులు విశేషంగా హాజరయ్యారు. మంత్రి పొంగూరు నారాయణ, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాజరాజేశ్వరి అమ్మవారు పులివాహనంపై తరలివెళ్లారు. ఉభయకర్తలుగా కొలపర్తి వెంకటరమేష్, సువర్ణలక్ష్మి దంపతులు వ్యవహరించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మైపాడు గేట్ సెంటర్‌లో తెపోత్సవం సందర్భంగా భక్తుల కోసం మంచినీటి చలివేంద్రాన్ని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ, కమిటీ సభ్యులు సురేంద్ర, శేఖర్, పవన్, సందీప్, శీనయ్య, సీపీఎం ఆరో డివిజన్ కార్యదర్శి చంద్రయ్య, రాంబాబు, రవూఫ్, సలామ్ తదితరులు పాల్గొన్నారు.

## శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై దాడి

నెల్లూరు(క్రైమ్): శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై కొందరు దాడి చేసి గాయపర్చి, చంపుతామని బెదిరించిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసును బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని కొండదిబ్బకు చెందిన సుబ్రహ్మణ్యం కార్పొరేషన్లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నగరానికి చెందిన యశ్వంత్ ద్వారా తిరుపతికి రొయ్యలను ఆయన పంపగా, అవి చెడిపోయాయి. విషయం తెలుసుకున్న సుబ్రహ్మణ్యం.. యశ్వంత్‌ను పది రోజుల క్రితం నిలదీయడంతో వీరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో సుబ్రహ్మణ్యం తన స్నేహితుడు కృష్ణతో కలిసి పాత జెడ్పీ సెంటర్ వద్ద మంగళవారం ఉండగా, కిశోర్, విన్‌బాబు వీరి వద్దకొచ్చారు. తమ స్నేహితుడితో గొడవ పెట్టుకుంటావానంటూ దాడి చేశారు. స్థానికులు రావడంతో అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన సుబ్రహ్మణ్యం జీజీహెచ్‌లో చేరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో యువకుల వీరంగం

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో ముగ్గురు యువకులు వీరంగం చేశారు. బీవీనగర్‌లో రహదారులపై పార్క్ చేసిన ఐదు కార్ల అద్దాలను బుధవారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల ప్రాంతంలో రాళ్లతో ధ్వంసం చేసి అక్కడి నుంచి ఉడాయించారు. కార్ల అద్దాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన యజమానులు స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఇందులో కార్ల అద్దాలను రాళతో యువకులు పగలగొడుతున్న దృశ్యాలు రికార్డవడంతో వాటిని సేకరించారు. సదరు యువకుల కోసం పరిసర ప్రాంతాల్లో ఆరాతీశారు. అనంతరం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన చిత్రం

## ఏసీ స్టేడియంలో సంక్రాంతి సంబరాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సంక్రాంతి సంబరాలను వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అరిసెలను బెజవాడ సునీల్‌రెడ్డి పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, సభ్యులు స్వర్ణ రమేష్‌బాబు, మురళీకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, నాగేశ్వరరావు, కేఎమ్కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(బృందావనం): సంక్రాంతిని పురస్కరించుకొని నవాబుపేటలోని రంగనాథనగర్‌లో రంగవల్లుల పోటీలను వాసవీ క్లబ్ నెల్లూరు సిటీ, ఆ ప్రాంత వాసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులతో పాటు చీరలను శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా రవికుమార్ అందజేశారు. రాచపూటి వినోద్‌కుమార్, బయ్యా మల్లిక, శ్రీరామ్ పుష్పలత, చలువాది రజని, పాదర్తి బాలాజీ, చలువాది నాగేశ్వరరావు, పబ్బిశెట్టి నందకిశోర్, వెంకటేశ్వరరావు, లీలామోహన్, మెంటా రమేష్ పాల్గొన్నారు.



## పేదలకు వస్త్రాల అందజేత

నెల్లూరు(అర్బన్): చిన్నబజార్‌లోని న్యూ రాజ్యలక్ష్మి హాల్ వద్ద వెయ్యి మందికి వస్త్రాలను పంపిణీ చేసి అన్నదానాన్ని నిర్వహించారు. బయ్యా వెంకటరమణయ్య, సరోజనమ్మ మెమోరియల్, శుభమస్తు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు.

➡ నగరంలోని శుభమస్తు షాపింగ్ మాల్ వద్ద పేదలకు అన్నదానాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు సంస్థ సభ్యుడు శ్రీరాములు జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. పీడీజీ లయన్ బయ్యా రవికుమార్, పూర్వ ప్రెసిడెంట్ బయ్యా శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ బొమ్మిశెట్టి మురళీకృష్ణ, ప్రెసిడెంట్ మారుతి ప్రసాద్, సెక్రటరీ చంద్రశేఖర్, కోశాధికారి శ్రీనివాసులు, సురేష్, రామకృష్ణ, బసవయ్య, ఖాసిం పాల్గొన్నారు.



### రమాదేవి మృతి బాధాకరం

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారిగా పనిచేసి.. బాపట్ల జిల్లా ఏడీఎంహెచ్ఓగా ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన రమాదేవి మృతి చెందడం బాధాకరమని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### బోడిగాడితోట పేరు మారుస్తాం

నెల్లూరు (సెంట్రల్): స్థానికుల అభ్యర్థన మేరకు నగరంలోని బోడిగాడితోట పేరును త్వరలో మారుస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. బోడిగాడితోటను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం నవాబుపేటలోని శివాలయం, ధర్మరాజస్వామి ఆలయాలను దర్శించుకున్నారు.

### వేమన జయంతికి ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): నగరంలో ఈ నెల 19న నిర్వహించనున్న వేమన భగవాన్ జయంతి కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఆహ్వానించామని త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు నగరాధ్యక్షుడు సురమౌళి తెలిపారు. కార్యక్రమాన్ని రెడ్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని చెప్పారు.

### గుడిపల్లిపాడులో ఘర్షణ

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని గుడిపల్లిపాడులో ఇరువర్గాలు దాడి చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు.. గుడిపల్లిపాడులోని అరుంధతీయపాళేనికి చెందిన మణీంద్ర, అశోక్ వేర్వేరుగా మద్యం సేవించసాగారు. ఈ క్రమంలో వీరి మధ్య మాటామాటా పెరిగడంతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. అనంతరం మణీంద్ర తన వర్గంతో కలిసి అశోక్ ఇంటికెళ్లి వారిపై దాడి చేశారు. మణీంద్ర వర్గానికి చెందిన వారూ గాయపడ్డారు. ఈ సందర్భంగా బీజేపీ రూరల్ మండల జనరల్ సెక్రటరీ సురేష్ మాట్లాడారు. తన కుటుంబంపై మణీంద్ర వర్గం దాడికి పాల్పడిందని ఆరోపించారు. వీరికి స్థానిక టీడీపీ నేతల అండదండలున్నాయని చెప్పారు. కాగా అశోక్‌పై మణీంద్ర వర్గం ఫిర్యాదు చేసింది.

## భక్తిశ్రద్ధలతో గోపూజ

నెల్లూరు(బృందావనం): కనుమను పురస్కరించుకొని మూలాపేటలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గల గోశాలలో గోపూజను బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. నేతలు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, కరణం సుభాషిణి, నాగలక్ష్మి, పద్మావతి, గంటా విజయలక్ష్మి, నరాల సుబ్బారెడ్డి, నాగేంద్రసింగ్, నీలిశెట్టి లక్ష్మణ్‌రావు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

➡ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి సన్నిధిలో గో పూజను నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మూలస్థానేశ్వరాలయంలో..

## బుజబుజనెల్లూరులో క్రికెట్ పోటీలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని 25వ డివిజన్ బుజబుజనెల్లూరులో క్రికెట్ పోటీలను ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పోటీలను విశ్రాంత ఉద్యోగ సంఘ నేత రమణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మాజీ నేత కొండా ప్రసాద్ మాట్లాడారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తున్నామని వివరించారు. సీపీఎం శాఖ కార్యదర్శి కృష్ణమూర్తి, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలు శ్రీనివాసులు, కొండా రవి, పుల్లయ్య, బెల్లంకొండ రమణయ్య, శేషయ్య, ఫిరోజ్, సుబ్రహ్మణ్యం సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## మాజీ సైనికులకు సత్కారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆర్మీ డేను పురస్కరించుకొని జనార్దన్‌రెడ్డికాలనీలోని బ్లాక్‌బోర్డు మిత్రమండలి కార్యాలయంలో మాజీ సైనికులు శ్రీనివాసులు, ఖాజారసూల్, అక్షయ్‌కుమార్‌ను దివ్యాంగుల ఐక్య సంఘం, బ్లాక్‌బోర్డు మిత్రమండలి ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. నిర్వాహకులు నరసాపురం ప్రసాద్, సనావుల్లా, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్, జక్కావుల్లా, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.



## నేత్రదానం

నెల్లూరు(అర్బన్): చిన్న పడుగుపాడుకు చెందిన ప్రమీలమ్మ (60) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో ఆమె నేత్రాలను సుభాష్ సేవా సంఘ అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులు దానం చేశారు. నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బ్లడ్ బ్యాంక్ ఐ టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులను సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321, 93471 11033 నంబర్లను సంప్రదించాలని కోరారు. మోటివేటర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న టెక్నీషియన్లు

## ఘనంగా పెద్దల పండగ

సంక్రాంతి సందర్భంగా తమ పితృదేవతలను స్మరిస్తూ.. ఇష్ట దైవాలను వేడుకుంటూ పూజలను నిర్వహించారు. మైపాడు రోడ్డులోని బోడిగాడితోటలో గల తమ పితృదేవతలు, పెద్దలు, పూర్వీకుల సమాధుల చెంత ప్రణమిల్లారు. వారితో తమకున్న ఆత్మీయానుబంధాలు, ప్రేమానురాగాలను నెమరేసుకొని భావోద్వేగాలకు గురయ్యారు. ఓ వైపు ఆనందభాష్పాలు.. మరోవైపు చెమ్మగిల్లిన కనులతో పితృదేవతలకు ప్రీతికరమైన పిండి వంటలను ధూపదీపాలతో సమర్పించి తమ బాధ్యతను గుర్తుచేసుకున్నారు.

– నెల్లూరు(బృందావనం)









